www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 28 జులై 2024
5
వైఎస్ఆర్



## పాఠ్య పుస్తకాల కోసం దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాశక్తి - కడప :** పేద ఇంజినీరింగ్ విద్యార్థుల పాఠ్యపుస్తకాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గంజికుంట ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గంజికుంట రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు నెల 14 లోగా ganjikuntabookbankgkf6@gmail.com ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా చేనేత వర్గ విద్యార్థులకు మాత్రమే పరిమితమై గంజికుంట బుక్ బ్యాంక్ కార్యక్రమాన్ని ప్రస్తుతం సమాజంలోని ఇతర వర్గ నిరుపేద విద్యార్థులందరికీ కూడా విస్తరిస్తున్నామని తెలియజేశారు. 2015 నుండి ఇప్పటివరకు నిర్విఘ్నంగా, నిరాటంకంగా కొనసాగిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9059598222, 9848 518213 వాట్సాప్ నంబర్లకు మెసేజ్ ద్వారా గాని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని తెలిపారు.

# కెసి కెనాల్, తెలుగుగంగకు తక్షణం నీరివ్వండి

**- జెసికి ఎపి రైతు సంఘం నాయకుల వినతి**

**ప్రజాశక్తి- కడప అర్బన్**

శ్రీశైలం జలాశయానికి ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో వరద నీరు భారీగా చేరుతున్నదని, డ్యాం నీటిమట్టం దాదాపు 870 అడుగులకు చేరుకుందని, తక్షణమే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా, గాలేరు నగరి కాలువ ద్వారా గోరుకల్లు, అవుకు, గండికోట ప్రాజెక్టుకు, కెసి కెనాల్, తెలుగంగ, వెలుగోడు ప్రాజెక్టులకు నీరు విడుదల చేయాలని జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్‌ను ఎపి రైతు సంఘం, సిఐటియు నాయకులు కోరారు. శనివారం ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు రెడ్డి, రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ పి.శివారెడ్డి కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, అరకొరగా వేసిన పంటలు ఎండు దశకు వచ్చాయని, శ్రీశైలం ప్రాజెక్టు నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సీమ జిల్లాలలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు, కెసి కెనాల్, తెలుగంగ ప్రాజెక్టులకు నీళ్ళు విడుదల చేయాలని తెలిపారు. శ్రీశైలం జలాశయంలో 854 అడుగులకు చేరగానే పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేసే వీలు ఉన్నందున చెప్పారు. కెసి కెనాల్‌తో పాటు వెలిగోడు జలాశయానికి నీరు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కెసి కెనాల్ ఆయకట్టు రైతులు కూడా నీళ్ళు వస్తాయని ఆశతో ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. బోరుబావుల కింద నారుమళ్ళు ఒకపక్క సిద్ధం చేసుకుంటున్నారని తెలిపారు. తక్షణమే నీటి సలహా మండలి సమావేశం జరిపి నీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వెలిగోడు జలాశయం, బ్రహ్మం సాగర్, గండికోట ప్రాజెక్టుల డెడ్ స్టోరేజ్ లో నీరు ఉన్నందున తక్షణం వెలుగోడును నింపి తెలుగు గంగ జలాశయాలైన ఎస్ఆర్1,ఎస్ఆర్ 2 తో పాటు బ్రహ్మం సాగర్ జలాశయాలని నింపాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం నుంచి దిగువకు దాదాపు 35 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్న ప్రభుత్వం కెసి కెనాల్‌కు, వెలిగోడుకు నీరు ఇవ్వక పోవడం పట్ల అన్యాయమని తెలిపారు. జిల్లా ప్రజా ప్రతినిధులు, కృష్ణా నీటి యాజమాన్య బోర్డు తక్షణమే స్పందించి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా గాలేరు నగరి, గోరకల్లు, అవుకు గండికోట, తెలుగు గంగ, బ్రహ్మం సాగర్, వెలుగోడు జలాశలకు నీటి విడుదల చేయాలని ప్రజా ప్రతినిధులు స్పందించాలని డిమాండ్ చేశారు.



జెసికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

### ప్రశ్నించకపోతే ప్రభుత్వాలు

# పేదల కోసం పనిచేయవు

- భూ కబ్జాలకు పాల్పడుతున్న పెద్దలపై 'ల్యాండ్ గ్రాబింగ్ కేసులు' నమోదు చేయాలి
- 'ప్రజా దర్బార్లు' ప్రతి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించాలి
- 'మహాధర్నా'లో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్





ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట మహాధర్నా చేస్తున్న పేదలు, సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి - బద్వేలు**

ప్రశ్నించకపోతే ప్రభుత్వాలు పేదల కోసం పనిచేయవని, భూ కబ్జాలకు పాల్పడుతున్న పెద్దలపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సిపిఎం బద్వేల్ రూరల్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట సుమారు 600 పైగా పేదలతో వారి సమస్యలపై మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రజలు ప్రశ్నించకపోతే ప్రభుత్వాలు పేదల కోసం పనిచే యవని, గడిచిన 70 ఏళ్లుగా ప్రభుత్వాలు వస్తున్నాయి, పోతున్నాయని, పేదల జీవితాల్లో మార్పు రావడం లేదన్నారు. పేదల సమస్యల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యంపై పేదలు ఐక్యంగా పోరాడాలని పేర్కొన్నారు. ఎన్నికల ముందు భూకబ్జాదారులపై ల్యాండ్ గ్రాఫింగ్ కేసులు పెడతామని తెలుగుదేశంపార్టీ వారు వాగ్దానాలు ప్రజలకు ఇచ్చారని, జైళ్లకు పంపించి కఠినంగా శిక్షిస్తామని వాగ్దానం చేశారని, ఎప్పుడు ఎన్నికల వాగ్దానం అమలు చేస్తారని వారు నిలదీశారు. అసెంబ్లీలో ఎన్‌డిఎ ప్రభుత్వం, తెలుగుదేశం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూకబ్జాలపై శ్వేత పత్రం విడుదల చేస్తామని, హై లెవెల్ ఎంక్వైరీ కమిటీ వేస్తామని, భూకబ్జాలపై శ్వేత పత్రం విడుదల చేస్తామని, అసెంబ్లీ సాక్షిగా బహిరంగపరిచారని, అటువైపుగా చర్యలు లేవని, మాటలో కాకుండా చేతల్లో అమలు చేయాలన్నారు. బద్వేల్ నియోజకవర్గంలోని సి.కొత్తపల్లి పొలం ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకొని వన వాసం చేస్తున్నారని, వారికి కనీసం మంచినీరు అందించాలన్న ఇంగిత జ్ఞానం ప్రభుత్వాలకు కరువైందని వాపోయారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, బద్వేల్ మండలం రూరల్ కమిటీ కార్యదర్శి దాసరి వెంకటేష్, ఈ.వెంకటరమణ, పి.చాంద్ బాషా మాట్లాడుతూ. బద్వేలు రూరల్ మండలం సి.కొత్తపల్లె రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 1,30, 46,46/1,2,3,4, 54, 73, 90, లలో 30 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. గతంలో ప్రభుత్వ భూమిని హెచ్చరిక బోర్డులు వేశారని, ఇప్పుడు అవి ఏమైనాయో కనపడటం లేదన్నారు. అట్లూరు మండలం నలాయపల్లె గ్రామ పొలం సర్వేనెంబర్ 40,41,42,43, లోని సుమారు 500 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని భూములేని నిరుపేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వేనెంబర్ 97, 98, 99 లలో సుమారు 20 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నట్లు దురాక్రమణకు గురైనట్టు, గ్రామస్తులు చెబుతున్నారని ఆర్‌డిఒ విచారించి నిజా నిజాలు తేల్చాలన్నారు. 180,182,183,188 మునక ప్రాంతం వారికి ప్రభుత్వం ఇచ్చినటువంటి 50 ఎకరాల భూములను స్థానికేతరులైన పెద్దలు అన్యక్రాంతం చేసుకుని దౌర్జన్యంగా అనుభవించుకుంటున్నారని, ఇది ఏమిటంటే కొడతాము, సంపుతామని గ్రామస్తులు సిపిఎం నాయకులకు చెప్పుకొస్తున్నారని ఆయన తెలిపారు. కాశినాయన మండలం సర్వే నెంబరు ఒకటి నుండి 192 వరకు 25 856 ఎకరాలు , పోరుమామిళ్ల రంగసముద్రం పంచాయతీ సర్వే నంబరు 59 160 ఎకరాలు, క్రాస్ రోడ్ లో 954 సర్వే నెంబరులో 250 ఎకరాలు, కలసపాడు మండలం శంఖవరం ముదిరెడ్డిపల్లె లలో వెయ్యి ఎకరాలు సబ్జా గురైందని బ్రహ్మంగారిమఠం మండలంలో సర్వేనెంబర్ 1088లో 200 ఎకరాలు సబ్జా గురైందని అట్లూరు మండలం ఎస్ వెంకటాపురం నల్లాయపల్లెలో సుమారు 500 ఎకరాలు కబ్జా గురయ్యాయని వాపోయారు. కార్యక్రమంలో బద్వేర్ రూరల్ భూ పోరాట కమిటీ సభ్యులు రామ్మోహన్, చంద్ర, సునీత, మేరమ్మ, చిన్న, అరవింద్, సరస్వతి, దుర్గమ్మ, సుభద్రమ్మ, మాధవి, స్వప్న, సుదర్శన్ పాల్గొన్నారు.



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, బాలోత్సవ కమిటీ నాయకులు

## జెవివి కార్యక్రమాలు అభినందనీయం : కలెక్టర్

**ప్రజాశక్తి - కడప అర్బన్**

జిల్లాలో జెవివి చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని కలెక్టర్ శివశంకర్ అన్నారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో జెవివి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు పురస్కరించుకుని నిర్వహించబోయే చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల బ్రోచర్లు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలపై, భారతీయ-సంస్కృతి, సంప్రదాయంపై చిత్రలేఖనం, వ్యాసరచన నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడం కోసం కడప బాలోత్సవం కృషి చేయడం అభినందనీయమన్నారు. బాలల్లో సృజనాత్మక శక్తిని పెంపొం దించేందుకు ప్రతి నెలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాలలు చదువుతో పాటు సమాజంపట్ల బాధ్యత, ఆదర్శనీయమైన భావాల పెంపునకు కృషి చేయా లన్నారు. తెలుగు భాషా దినోత్సవం, గణిత దినోత్సవం, పర్యావరణ దినోత్సవం, బాలికా దినోత్సవం, అబ్దుల్ కలాం జయంతి, బాలల దినోత్సవం, మాదక ద్రవ్యాలపై అవగాహన లాంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్ర మంలో కడప బాలోత్సవ అధ్యక్షులు గోపాల్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్, కోశాధికారి సునీత, ఉపాధ్యక్షులు బాలయల్లా రెడ్డి, సుందరయ్య, ఉషా తులసి, అరుణ, కార్యదర్శులు మధుసూదన్, సరస్వతి, చినరాయుడు హాజరయ్యారు.

## రేపు అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి ముఖాముఖి

**ప్రజాశక్తి - కడప :** 2024-25 విద్యా సంవత్సరానికి గాను, కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల (అటానమస్ కళాశాల)లో ఖాళీగా ఉన్న పీడీ( ఫిజికల్ ఎడ్యుకేషన్) అతిథి అధ్యాపక పోస్టు భర్తీ కోసం అర్హులైన అభ్యర్థులతో ఈనెల 29న ముకాముఖి ముఖాముఖి నిర్వహించనున్నట్లు కశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌లో ఒక పోస్టు ఖాళీగా ఉందని, ఎంపికలో యుజిసి-నెట్ , స్లెట్/ ఎపిసెట్ / పిహెచ్‌డి ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు కళాశాలలో సంప్రదించాలని కోరారు. వివరాల కోసం 950 2547 993లో సంప్రదించాలని కోరారు.

## నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

**ప్రజాశక్తి - కడప :** ఆదివారం సెలవు దినం అయినప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈనెల 28న జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యధాతథంగా పనిచేస్తాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పిఆర్‌టియు నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి-అట్లూరు :** డెమోక్రటిక్ పిఆర్‌టియు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వెంకటేసు, అరుణ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో డెమోక్రటిక్ పిఆర్‌టియు ఉపాధ్యాయ సమస్యలతో పాటు ఉపాధ్యాయ సేవాదళ్ పేరుతో విద్యార్థులకు అండదండలుగా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తుందని తెలిపారు. రాబోయే కాలంలో మండలంలో ఉపాధ్యాయ సమస్యలను తీర్చడంలో డెమోక్రటిక్ పిఆర్‌టియు ముందుంటుందని, విద్యార్థులకు సాయం చేయడంలో ముందుంటూ తమ దృష్టికి వచ్చిన న్యాయబద్ధమైన ఉపాధ్యాయ సమస్యలను తీర్చడానికి అంకితభావంతో పని చేస్తామని తెలిపారు.

## మహిళా ఉద్యోగులకు రక్షణ కవచం 'పోష్'

**ప్రజాశక్తి-కలసపాడు**





సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి సిడిపిఒ శ్రీలక్ష్మి

పోష్ యాక్ట్ చట్టం మహిళా ఉద్యోగులకు ఒక కవచం లాంటిదని ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి సిడిపిఒ శ్రీలక్ష్మి అన్నారు. శనివారం మండల పరిషత్ సభా భవనంలో ఏర్పాటుచేసిన పంచాయతీ సెక్రటరీలు, మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ మహిళలు సమాజంలో ఉద్యోగాలు చేస్తున్నారని వారు పని చేసే చోట అమర్యాదగా, అసభ్యకరంగా ఎవరైనా ప్రవర్తిస్తే అలాంటి వారికి రక్షణగా పోష్ యాక్ట్ వచ్చిందని పేర్కొన్నారు. చట్టంలో పదిమంది కమిటీ సభ్యులు ఉంటారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శైలజ, ఇఒపిఆర్‌డి మురారి పాల్గొన్నారు.

## కళాశాలల్లో 'మధ్యాహ్న భోజనం' అమలు చేయాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలని పిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సి.పి. నాగేంద్ర, ఎఐబిఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు రమావత్ జగన్ నాయక్ కోరారు. శనివారం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే విద్యార్థులు చాలా మంది పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముఖ్యంగా మౌలిక వసతులను కల్పించాలని, జూనియర్ కళాశాలల భవనాలు కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. తల్లికి వందనం పథకాన్ని ఎలాంటి షరతులు లేకుండా ఎంత మంది విద్యార్థులు ఉంటారో అంత మందికి కచ్చితంగా అమలు పరచాలని డిమాండ్ చేశారు. నాయకులు కిరణ్, ప్రకాష్, సంజయ్, శ్యామ్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**ప్రజాశక్తి - కడప**

పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని కడప ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. ప్రభుత్వ పురుషుల కళాశాల జంతు శాస్త్రశాఖ వారి ఆధ్వర్యంలో శనివారం 'సుస్థిరాభివృద్ధిని సాధించడంలో పర్యావరణ సవాళ్లు' అనే అంశం మీద ఒకరోజు అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సు ప్రారంభంలో ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం తరుగుతున్న వనరులు వీటన్నిటి దృశ్య ఇటువంటి సదస్సులు నిర్వహించటం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. సదస్సులో మెరిచే ఫిలిప్పీన్స్ మాట్లాడుతూ పెరుగుతున్న సముద్ర ఆమ్లీకరణను తగ్గించడంలో సీ గ్యాస్ లేదా సముద్ర గడ్డి ప్రాముఖ్యతను వివరించారు. ప్రస్తుత పట్టణీ కరణలో పెరుగుతున్న అనారోగ్యాల దృశ్య సాంప్రదాయ పానీయాల లాభాలు, వాటి ఆవశ్యకతను మలేషియాలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నటువంటి డాక్టర్ ఇస్మాయిల్ వివరించారు. ఇసిఒఆర్ డైరెక్టర్ జిష్ణు మాట్లాడుతూ పెరుగుతున్న పర్యావరణ కాలుష్యం ద్వారా మానవ ఆరోగ్యం ఏ విధంగా ప్రభావితం చేస్తుందని, వీటికి అవసరమైన ప్రత్యామ్నాయ విధి విధానాల ద్వారా సుస్థిర అభివృద్ధిని ఏ విధంగా సాధించవచ్చు అనే అంశాలను వివరించారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ వై. సావిత్రి సదస్సు ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమం ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి. రవి శేఖర్ సదస్సు ముఖ్య అంశాలను, పర్యావరణ సమస్యలను ఎదుర్కొనే విధానాలను వివరించారు. కార్యక్రమంలో అకాడమీక్ కో-ఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, ఐక్యూ ఎసి కో-ర్డినేటర్ డాక్టర్ బి రామచంద్ర, జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ డివి నాగేంద్ర కుమార్, మహేష్ అపర్ణ వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్:** హాస్టల్ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని సంక్షేమ శాఖ అధికారి భరత్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సంక్షేమ, వసతి గృహ సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివేలా శ్రద్ధ వహించాలని చెప్పారు. వసతిని బట్టి విద్యార్థులను చేర్చుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు సమీప వసతి గృహాల్లో పిల్లలను చేర్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో సహాయ సంక్షేమ అధికారులు కృష్ణయ్య, నాగేంద్ర రాజు, జ్యోతి, కార్యాలయ పర్యవేక్షకులు ఆంజనేయులు, వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## కళావేదిక కో-కన్వీనర్‌గా ముత్తుముల రామకృష్ణారెడ్డి

**ప్రజాశక్తి- పోరుమామిళ్ల :** రాష్ట్ర కళా వేదిక కో-కన్వీనర్‌గా ముత్తుముల రామకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక పట్ల మండల శాఖ ఎస్‌టియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.పుల్లయ్య, జయరామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముత్తుముల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తనమీద నమ్మకంతో రాష్ట్ర కళావేదిక కో-కన్వీనర్‌గా ఎన్నుకున్న ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్. సాయి శ్రీనివాస్, ఎం.రఘునాథరెడ్డి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ఎండి ఇలియాస్‌బాష, యన్. సంగమేశ్వర రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అన్నదానం

**ప్రజాశక్తి -కడప అర్బన్**



చిల్డ్రన్ కేర్‌లో కెఎస్ఆర్ఎం ఎన్ఎస్ఎస్ విభాగం ప్రతినిధులు

కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం అధ్వర్యంలో విస్తృతంగా సేవ కార్య క్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం కళాశాల సివిల్ విభాగం ప్రొఫెసర్ గిరిధర్ తండ్రి శంకరయ్య జన్మదినం సందర్భంగా కడపలోని రాస్ మెంటల్ రిటార్డేన్ చిల్డ్రన్ కేర్‌లో అన్నదానం నిర్వహించారు. దీంతోపాటు స్నాక్స్, చాపలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె. చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపల్ విఎస్ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ టి.ఎన్ ప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్ కుమార్, ప్రొఫెసర్ గిరిధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సురేష్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి - పోరుమామిళ్ల**

పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ప్రయివేట్ హై స్కూల్ వెనుక భాగాన పోరుమామిళ్ల చెరువు నుంచి రంగసముద్రం చెరువుకు పోయే పంట కాలువను భూకబ్జాదారులు కబ్జా చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి బైరవప్రసాద్, సిఐటియు మండల కన్వీనర్ కుప్పాల పుల్లయ్య పేర్కొన్నారు. శనివారం ఉదయం మురుగు నీరు నిలబడిన ప్రాంతాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరుమామిళ్ల చెరువు నుంచి రంగసముద్రం చెరువకు పంట కాలవ గతంలో ఉండేదని పేర్కొన్నారు. పంట కాలవ నుంచి నీరు సమృద్ధిగా రంగసముద్రం చెరువులోకి చేరేదన్నారు. ప్రస్తుతం కొందరు పంటకాల్వను ఆక్రమించి ఇళ్ల స్థలాల కోసం ప్లాట్లు వేయడంతో పూర్తిగా కన్పించకుండా పోయిందన్నారు. దీంతో రైతుల పొలాలకు చెరువుల నీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తాలయన్నారు. పంట కాల్వను ప్లాట్లు వేసి ప్రజలకు విక్రయిస్తున్న వారిని సంబంధితాధికారులు విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ పంట కాలువల నుంచి వచ్చే నీరు ప్రయివేట్ స్కూల్ సమీపంలో చేరడంతో మురుగు కుంటలా తయారైందని పేర్కొన్నారు. మురుగు కుంట నుంచి వచ్చే దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పైగా డెంగీ, మలేరియా, టైపాయిడ్ జ్వరాలు వచ్చే ప్రమాదముందని, పంట కాల్వను పూడ్చిన దేశాయి నాగేంద్ర రెడ్డిపై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో అన్ని కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున్న ఆందోళన చేస్తామని నాయకులు హెచ్చరించారు.

## ఉచిత ప్రయాణానికి అదనపు బస్సులు అవసరం

**- ఆర్‌టిసి ఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య**

**ప్రజాశక్తి - కడప అర్బన్**

తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేయబోయే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతం కావాలంటే కొత్త బస్సులు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక జోనల్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జి.బోసుబాబు అధ్యక్షతన జిల్లా కార్యదర్శి రామమూర్తి ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.వి.నరసయ్య మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం జయప్రదం కావాలంటే ఇప్పుడున్న కొద్దిపాటి బస్సులతో సాధ్యపడదని తెలిపారు. కొత్త బస్సులు కొనుగోలు చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారుల వరకూ బస్సుల సంఖ్య తగ్గించడం మానుకుని రద్దు చేసిన, చేస్తున్న బస్సులను పునరుద్ధరణ చేసి ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ప్రభుత్వ హామీ నెరవేరుతుందని పేర్కొన్నారు. సమావేశంలో,నాయకులు రాముగౌడ్, పద్మనాభ రెడ్డి, నరసింహులు,వెంకటరమణ, శివారెడ్డి, మునయ్య, రఘునాథ్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రామచంద్రారెడ్డి, గంగిరెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్లు మల్లికార్జున, రవినాయక్, జిల్లాలోని ఆరు డిపోల నాయకులు, అమరావతి జెఎసి మహిళా నాయకులు విజయమ్మ హాజరై ప్రసంగించారు.

## శాస్త్రవేత్తలను స్మరించుకుందాం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

శాస్త్రవేత్తలను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జెవివి సీనియర్ నాయకులు పి. వెంకటేశ్వర్లు, ఎస్.సునీత అన్నారు. శనివారం కడపలోని గుడ్ మేనర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శాస్త్రవేత్త జాన్ డాల్టన్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో శాస్త్రవేత్తల కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. సమాజ పురోభివృద్ధికి, మానవాళి ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారాలు చూపెట్టారని తెలిపారు. అటువంటి వారిలో జాన్ డాల్టన్ ఒకరని చెప్పారు. పదార్థాన్నిక్షిప్త సూత్రం ప్రతిపాదించారన్నారు. జెవివి నాయకులు వై. అరుణ, పి.కుమార్ స్వామి రెడ్డి మాట్లాడుతూ ద్రవ్యం, పరమాణువులు, రసాయనిక చర్యలపై అనేక పరిశోధనలు చేసి ఆధునిక పరమాణు సిద్ధాంతానికి పునాదులు వేసిన శాస్త్రవేత్త, జాన్ డాల్టన్. అన్నారు. అణుశక్తి వినియోగానికి డాల్టన్ పరమాణు సిద్ధాంతమే బాటలు పరిచిందని పేర్కొన్నారు. ఈయన వాతావరణ శాస్త్రం, వర్ణాంధత్వం, చంద్రుడు మీద కూడా పరిశోధనలు చేశారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సుకుర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# మర్మమేమిటో!

ప్రజాదృష్టి

మదనపల్లి మంటల మరమ్మమేమిటో అంతుచిక్కడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల పాత్ర ఉంటే ఎంత ఉంది, ఏ స్థాయిలో ఉందనే అంశాల్ని ముందుగా తేల్చాలి. ఈదిశగా రాష్ట్ర డిజిపి, సిఐడి చీఫ్, రెవెన్యూ స్పెషల్ సెక్రటరీ స్థాయిలతో కూడిన అధికార యంత్రాంగం కదిలింది. విచారణను వేగవంతం చేసింది. మంటల కారకుల గుర్తింపులో నిమగ్నమైంది. మదనపల్లి పూర్వ ఆర్‌డిఒ స్థాయి అధికార కేంద్రంగా మంటలు ఎగిసి పడుతుండడంపై రాజకీయ కోణం ఉందనే వాదన వినిపిస్తోంది. చిత్తూరు జిల్లాకు చెందిన ఓ పెద్ద నాయకుని అండ చూసుకుని ఉన్నతాధికారులే రికార్డులు తగలబెట్టారనే ఊహాగానాలు ఉన్నాయి. ఐదేళ్లుగా ఆర్‌డిఒ స్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా సాగించిన భూముల పందేరం అనే వాదన వినిపిస్తోంది. డిజిపి, సిఐడి చీఫ్, రెవెన్యూ స్పెషల్ సెక్రటరీతో సహా జిల్లా స్థాయిలో ఐదు విచారణ బృందాల సారథ్యంలో విచారణ వేగవంతం చేశారు. సబ్ కలెక్టర్ తాలూకాలోని 11 మండలాలకు చెందిన తహశీల్దార్లను పిలిపించుకుని విచారణ చేపడుతున్నారు. విచారణలోభాగంగా ఇప్పటివరకు ఒకరి చిన్నస్థాయి ఉద్యోగిని మాత్రమే అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన పాత్రదారులను గుర్తించడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. సిసి టివి రికార్డులు, సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా మంటల రోజు, మంటలకు ముందు రోజు ఆఫీసులో ఎవరెవరు ఉన్నారనే కోణంలో అన్వేషణ సాగిస్తోంది. గతేడాది నెల్లూరు జిల్లా న్యాయస్థానంలో రికార్డులను కాల్చి వేసిన సంగతి తెలిసిందే. వారం రోజుల కిందట పుంగనూరు ఎంపిడిఒ కార్యాలయంలో మంటలు చెలరేగడం, తాజాగా మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంటల చెలరేగి రికార్డులు అగ్నికి ఆహుతి కావడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మదనపల్లి మంటల ఘటన కుట్ర కోణమని అధికారులు చెబుతున్నారు. రాజకీయాలకు అతీతంగా విచారణ సాగించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. యాదృశ్చికంగా సంభవించి ఉంటే రికార్డులను భద్రపరచడానికి సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలి. మంటల ఘటనలో కాలిన వాటిలో మాన్యువల్ రికార్డులు మాత్రమే ఉన్నాయా, లేక ఆన్‌లైన్ రికార్డులు సైతం ఉన్నాయా అనే పరిశీలించాల్సి ఉంది. ఆన్‌లైన్ రికార్డులు కాలితే ఆధారాలను ఎలా రూపుమాపగలరో ఆలోచించాలి. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆన్‌లైన్ రికార్డులు దగ్గమైతే, సంబంధిత ఉన్నతాధికారులకు చెందిన కార్యాలయాల్లో రికార్డులు ఉండే అవకాశం ఉంది. వాటి ఆధారంగా రికార్డులను తిరిగి తెచ్చుకో వడానికి అవకాశం ఉంటుంది. మాన్యువల్ రికార్డులను ఆన్‌లైన్ చేయని సంబం ధిత అధికారులే మంటల ఘటనకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కుట్రకోణం దాగి ఉంటే టెక్నాలజీ ద్వారా కాలిన రికార్డులను తిరిగి తెచ్చుకునే అవకాశం ఉంటుంది. ఇటువంటి చిన్నపాటి గ్రహింపు లేకుండానే మంటలు పుట్టించి ఉంటారా అనేది తేలాల్సిన అంశం. ఇందులో ఇతరమేదైనా కుట్రకోణం ఉంటే కుట్రదారులు ఏమి ఆశించి రికార్డులను తగులబెట్టి ఉంటారు.లబ్ధిదారులు ఎవరనే కోణంలో విచారణ సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**- ప్రజాశక్తి-కడప ప్రతినిధి**

### డిపార్ట్‌మెంటల్ పరీక్షలను

# పటిష్టంగా నిర్వహించాలి : డిఆర్‌ఒ

**ప్రజాశక్తి - కడప**

ఈనెల 28 నుండి ఆగస్టు 2 వరకు నిర్వహించే ఎపిపిఎస్‌సి డిపార్ట్‌మెంటల్ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్ అధికారులను ఆదేశించారు. శనివారం తన ఛాంబర్‌లో డిపార్ట్ మెంటల్ పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. రోజూ రెండు సెషన్లలో ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు, అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు (అబ్జెక్టివ్ టైప్) నిర్వహిస్తారన్నారు. కన్వెన్షనల్ టైపు పరీక్షలను రోజూ ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 03.00 గంటల నుంచి సాయంత్రం 06.00 గంటల వరకు పట్టిషంగా నిర్వహించాలని సూచించారు. అభ్యర్థులు తమ పరీక్ష కేంద్రాలకు ఉదయం 08.30 గంటల నుండి 09.30 గంటల లోపు రావాలన్నారు. .పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. లైజెస్ ఆఫీసర్లు, చీఫ్ సూపర్‌వైజర్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా జరిగేలా చూడాలని సూచించారు. జిల్లాలోని కడప నగర పరిధిలో 1, చింతకొమ్మ దిన్నె మండల పరిధిలో 3 పరీక్షా కేంద్రలతో కలిపి మొత్తం 4 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

## రాజకీయాలకతీతంగా రైతులు ఏకం కావాలి

**ప్రజాశక్తి - చాపాడు**

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, నూతన నీటి ప్రాజెక్టులు రైతులు సాధించుకోవడానికి పార్టీలకు అతీతంగా ఏకం కావాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి.రమణ కోరారు. మండల పరిధిలోని అన్నవరం గ్రామంలో శనివారం ఆయన రైతులతో కలిసి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో, కేంద్రంలో రైతుల సంక్షేమం కోసం పాటుపడేవారు లేరన్నారు. పంట పండిన తర్వాత గిట్టుబాటు ధరలు లేక రైతు నష్టపోతే ఆదుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. ప్రాజెక్టుల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. ఇప్పటికైనా రైతులందరూ కలిసి తమ సమస్యలను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు వెంకటసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, మాబు షరీఫ్, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు నాయకులు

## చెన్నకేశవ స్వామి దేవస్థానం చైర్మన్ రాజీనామా

**ప్రజాశక్తి - చాపాడు**

మండల పరిధిలోని చియ్యపాడు చెన్నకేశవ స్వామి దేవస్థాన చైర్మన్ మహానందిగారి నిరంజన్‌రెడ్డి శనివారం రాజీనామా చేశారు. రెండేళ్లుగా ఆలయ అభివృద్ధికి కృషి చేసిన నిరంజన్‌రెడ్డి మారిన రాజకీయ పరిణామాలతో తన పదవికి రాజీనామా చేశారు. దేవాదాయ శాఖ ఇఒకు రాజీనామా ఆ పత్రం అందజేశారు. పురాతన చెన్నకేశవ స్వామి దేవస్థానాన్ని పునరుద్ధరణ చేసేందుకు ఆయన హయాంలో చర్యలు చేపట్టారు. అప్పటి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, దాతల సహాయంతో రూ.10.20 లక్షలు పోగు చేసి దేవాదాయ శాఖకు చెల్లించడంతో ప్రస్తుతం రూ.61 లక్షలు ఆలయ నిర్మాణానికి నిధులు సమకూర్చారు. అయితే గ్రామంలో కొంతమంది ఆలయ నిర్మాణానికి అడ్డంకులు చేయడంతో నిర్మాణ పనులు చేపట్టలేకపోయారు. ప్రస్తుతం నూతన చైర్మన్‌గా ఎవరు ఎన్నికైన తన వంతు సహకరిస్తానని ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి తెలిపారు.

## ప్రతి శనివారం అన్నదానం

**ప్రజాశక్తి - చక్రాయపేట**

మండలంలోని నెరుసుపల్లె పంచాయతీ దేవరగుట్టపల్లి–నాగలగట్టుపల్లె మధ్యలో ఉన్న దశరథ మహారాజు గుడి వద్ద ఆ గ్రామ మాజీ సర్పంచ్ సానే సుబ్బరామయ్య శనివారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గత రెండేళ్ల నుంచి ప్రతి శనివారం దాతలు ముందుకు వచ్చి అన్ని దానాల కన్నా అన్నదానం గొప్ప అనే చందంగా ప్రతి శనివారం దాతలు ముందుకు వస్తున్నారని సుబ్బరామయ్య తెలపారు. ఆలయ ధర్మకర్త సోము రామసుబ్బయ్య అన్నదాన కార్యక్రమం చేపట్టిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతాభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సుబ్బరామయ్య, దేవర గుట్టపల్లి ఆలయ ధర్మకర్త సోము రామసుబ్బయ్య కార్యక్రమాన్ని దశరథ మహారాజు స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.



అన్నం వడ్డిస్తున్న మాజీ సర్పంచ్ సుబ్బరామయ్య



క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

## పచ్చదోమ ఉధృతి నివారణకు చర్యలు

**ప్రజాశక్తి - ముద్దనూరు**

తెల్ల, పచ్చదోమ ఉధృతి నివారించేందుకు పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి రైతులకు సూచించారు. రాజులగురువాయపల్లె గ్రామంలో ఖరీఫ్‌లో సాగుచేసిన పొద్దుతిరుగుడు, పత్తి, మినుము, సోయా చిక్కుడు పంటలను శనివారం ఎఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవక భూమిలో సరిపడినంత తేమ లేదన్నారు. పంటలకు బెట్ట పరిస్థితి ఏర్పడి ఎండుముఖం పట్టాయన్నారు. ఈ దశలో పంటలను కాపాడుకోవడానికి 19.19.19 అనే నీటిలో కరిగే ఎరువును లీటరు నీటికి 10 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఎండుతున్న పంటల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు. సాగు చేసిన పంట వివరాలను ఆయా రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. కూటమి నాయకులు రాజుల సురేంద్రనాథ్ రెడ్డి, చింతా శివరామి రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఎపిజె అబ్దుల్ కలాంకు ఘన నివాళులు

**ప్రజాశక్తి - ఖాజీపేట**

ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రజ్ఞుడు, భారత మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతిని కొత్తనెల్లూరు సమీపంలో ఉన్న బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాల ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘ నంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, బీరం విద్యాసంస్థల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

**కడప :** ప్రతి విద్యార్థి ఎపిజె అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని జేమ్స్ నేషనల్ ఇంగ్లీష్ మీడియం డైరెక్టర్ మజార్ అలీఖాన్ అన్నారు. కృషి పట్టుదలతో ఎంతటి విజయన్నైనా సాధించవచ్చునని తెలిపారు. శనివారం అబుల్ కలాం 9వ వర్ధంతి సందర్భంగా రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో ఎపిజె అబుల్ కలాం చిత్రపటాన్ని పాఠశాల డైరెక్టర్ మజార్ కు అందజేశారు. ఈ సందర్భంగా సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఎంతో కష్టపడి చదివి రాష్ట్రపతిగా ఎన్నికై భారతదేశానికి 11వ రాష్ట్రపతిగా ప్రజలకు సేవ చేశారన్నారు. కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి అధినేత అబ్దుల్ షేక్ రాయల్ కరీముల్లా. విద్యార్థులు పాల్గొన్నారు.

# పులివెందులలో ట్రాఫిక్ కష్టాలు

### అడ్డగోలుగా తిరుగుతున్న వాహనాలు - నిబంధనలు మాటలకే పరిమితం



ట్రాఫిక్ వల్ల నిలిచిపోయిన వాహనాలు

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

పులివెందులలో ట్రాఫిక్ కష్టాలు అమ్మో అనిపించేలా ఉన్నాయి. అడ్డగోలుగా వాహనాలు రాకపోకలు సాగించడం.. ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తుండడంతో సమస్య తీవ్రమైంది. ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ఈ ఏడాది మే 27 నుంచి పూలంగళ్ళ సర్కిల్ నుంచి వైఎస్సార్ సర్కిల్, పాత బస్టాండ్ వరకు వన్ వే చేస్తామని.. మే 23న ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి మున్సిపల్ కమిషనర్ జి.రమణారెడ్డి పత్రికలకు చెప్పిన విషయం తెలిసిందే. కానీ ఇది మాటలకే పరిమితమైంది.. ఆచరణలో పెట్టలేదనే విమర్శలు ఉన్నాయి. పట్టణంలో ఇలాంటి సాహసోపేత నిర్ణయాలు అమలు చేయడం ఎంత మాత్రం సాధ్యం కాదని అధికారులు మరోసారి నిరూపించారు. అధికారులు తెలియజేసిన విధంగా పూలంగళ్ల సర్కిల్ నుంచి వెళ్లే వాహనాలకు మాత్రమే అనుమతి వైఎస్సార్ సర్కిల్ నుంచి వచ్చే వాహనాలకు మాత్రం నో ఎంట్రీ అన్న సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. కనీసం ఆర్‌టిసి బస్సులు కూడా నిబంధన ప్రకారం నడపకపోవడంతో ట్రాఫిక్ మరింత జఠిలమైంది. ప్రయివేట్ వాహనాలను నియంత్రించాలంటే కొంతవరకు కష్టంగా ఉంటుంది.. కానీ ఆర్‌టిసి బస్సులను నిబంధన ప్రకారం ఎందుకు తిప్ప లేకపోతున్నారో అనేది ప్రశ్నగానే మిగిలింది. ట్రాఫిక్ పోలీసులు ప్రతి సర్కిల్‌లో ఉన్న నిబంధనలు మాత్రం అమలు చేయలేదు. ఎప్పటిలానే యథావిధిగా వచ్చే వాహనాలు వస్తూ, పోతున్నాయి. శ్రీరామ హాల్ రోడ్డు, సెంట్రల్ బోలేవార్డ్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఎందుకంటే పట్టణం నుంచి వెళ్లే బస్సులు బోలేవార్డు ద్వారా పట్టణంలోకి వచ్చే బస్సులు శ్రీరామా హాల్ రోడ్డు ద్వారా రావాల్సి ఉంది. కానీ కొంతమంది ఆర్టీసీ డ్రైవర్లు వారికి ఇష్టం వచ్చినట్లు పోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారుతుంది. ట్రాఫిక్ వల్ల వాహనదారుల మధ్య ఘర్షణలు కూడా జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఇక్కడ షరా మామూలే అని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వాహనదారులకు అవగాహన కల్పించాలి.. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

## క్రీడల్లోనూ విద్యార్థులు గుర్తింపు పొందాలి

**ప్రజాశక్తి - వేంపల్లె**

చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు సత్తా చాటి, గుర్తింపు పొందాలని టోర్నమెంట్ అర్గనైజింగ్ కమిటి చైర్మన్ నిమ్మకాయల మహమ్మద్ దర్బార్ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆటస్థలంలో శనివారం రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. నిమ్మకాయల మహమ్మద్ దర్బార్ టార్గెట్ బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అలాగే ఆయా జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ టోర్నమెంట్‌ను వేంపల్లెలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యం పెట్టుకొని ముందడుగు వేస్తే విజయం వరిస్తుందని చెప్పారు. ఆ దిశగా ప్రతి విద్యార్థి క్రీడాల్లో రాణించాలని కోరారు. టార్గెట్ బాల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో జరిగే టార్గెట్ బాల్ క్రీడాల్లో ఆడేందుకు అవకాశం కల్పించనున్నట్లు వివరించారు. క్రీడల్లో బాలురలతోపాటు బాలికలు కూడా సమానంగా రాణించడం సంతోషంగా ఉందన్నారు. కడప, అనంతపురం, నెల్లూరు, చిత్తూరు, సత్యసాయి, కర్నూల్, గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాలతో పాటు ఆయా జిల్లాల నుండి టార్గెట్ బాల్ క్రీడాల్లో ప్రాల్గొనేందుకు విద్యార్థులు వచ్చినట్లు టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షురాలు కె.సంధ్యా చెప్పారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపేలా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నట్లు చెప్పారు. అనంతరం జరిగిన టార్గెట్ బాల్ పోటీల్లో ఆయా జిల్లాల విద్యార్థులు పోటాపోటీగా ఆడడంతో రసవత్తరంగా సాగింది. కార్యక్రమంలో టార్గెట్ బాల్ సౌత్‌జోన్ చైర్మన్ రేవంత్, గండి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మల్లారెడ్డి, అర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్, టిడిపి నాయకులు నిమ్మకాయల షాకీర్, రెడ్డి కిషోర్, రామాంజనేయురెడ్డి (చంటి), బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, రామాంజనేయులు, ఆయా జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారుల పరిచయంలో నిమ్మకాయల మహమ్మద్ దర్బార్

## వ్యాధుల నివారణకు శుభ్రతనే ముఖ్యం

**ప్రజాశక్తి - వేంపల్లె**

పరిసరాల శుభ్రతగా ఉంటేనే వ్యాధులను దూరం చేసేందుకు అవకాశం ఉంటుందని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని అలవలపాడు గ్రామంలో ఇంటింటికి వెళ్లి లార్వా సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుత సీజన్‌లో దోమకాటు ద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. నీటి నిల్వలు ఎక్కువ రోజులు లేకుండా చూసుకోవాలని సూచించారు. మంచి ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం, సిహెచ్ఒ వెంకటరత్నం, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, సిబ్బంది ఫయాజ్, ఆరోగ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో విచ్చలవిడిగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంయుక్త కార్యదర్శి, జై భీం రావ్ భారత్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కరుణాకర్ యాదవ్ శనివారం రాతపూర్వకంగా జిల్లా ఉన్నతాధికారులను కోరారు. కుందూ, పెన్నా నదుల నుంచి ఇసుక అక్రమ రవాణ ద్వారా కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. వారి ఆస్తులు ప్రభుత్వం జప్తు చేయాలన్నారు. సంబంధిత అధికారులు తూతూమంత్రంగా కేసులు నమోదు చేస్తున్నారనిపేర్కొన్నారు. కేసులు సిఐడికి అప్పగించి ఇందుకు సహకరిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ రవాణా ట్రాక్టర్ల అతివేగానికి పలు ప్రమాదాలు జరిగిన ఉదంతాలు ఉన్నాయన్నారు. అక్రమ రవాణాదారుల ఆధిపత్య గొడవలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. కొత్తగా వచ్చిన కలెక్టర్, పోలీస్ అధికారి స్పందించాలని ఆయన కోరారు.

## 3న మిగిలిన సీట్ల జాబితా విడుదల

**ప్రజాశక్తి - వేంపల్లె**

ఆర్‌జెయుకెటి పరిధిలోని ట్రిపుల్‌ఐటిల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగిలిన సీట్లకు సంబంధించి ఆగస్టు 3న జాబితా విడుదల చేస్తామని అడ్మిషన్ల కన్వీనర్ అమరేంద్ర కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూజివీడు, ఇడుపులపాయి, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లకు సంబంధించి మొదటి విడతగా 4,140 మంది విద్యార్థులను కౌన్సెలింగ్‌కు పిలవగా 3,396 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారని తెలిపారు. ఇంకా 746 సీట్లు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. రెండవ విడతలో మెరిట్ విద్యార్థులను కౌన్సెలింగ్‌కు పిలుస్తామన్నారు. మొదటి విడతలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు క్యాంపస్ మార్పు చేసుకోవాలనుకుంటే ఆర్జీయూకేటీ వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మొదటి విడతలో సీటు వచ్చి కౌన్సిలింగ్‌కు రాని వారు ఈనెల 30లోగా రెండవ విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## గోవులకు వైద్య పరీక్షలు

**వేంపల్లె :** పట్టణ పురవీధుల్లో అనారోగ్యంతో బాధపడుతున్న గోవులకు గో సంరక్షణ సేవా సమితి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వైద్య పరీక్షలు చేయించారు. స్థానిక శ్రీరాంనగర్ ప్రాంతంలో ఒక ఆవు గర్భసంచి సమస్యతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న మహిళా రైతు మానవతా సేవా సంస్థ సభ్యులకు, పశు వైద్యాధికారికి సమాచారం ఇచ్చారు. మానవతా సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, గండి దేవస్థానం చైర్మన్ కావలి క్రిష్ణతేజ, గో రక్షణ సేవా సమితి సభ్యులు దొంతు సుమన్ ఆధ్వర్యంలో పశు వైద్యాధికారి సాధిక్‌బాషా, రిటైర్డ్ వెటర్నరీ ఆఫీసర్ రాజారామ్ వైద్యం అందించారు. కార్యక్రమంలో గో సంరక్షణ సేవా సమితి సభ్యులు పుల్లగూర గోవర్ధన్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి : ప్రిన్సిపల్

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సం రక్షించాలని నిడివెనగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ తాతాజీ పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)కి ఇటీవల యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప నుండి గుర్తింపు లభించింది. ఈ నేపధ్యంలో పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో దాదాపు 300 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టాలని కోరారు. ప్రతి విద్యార్థి మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా తీసుకొని, వాటిని సంరక్షించాలని సూచిం చారు. కార్యక్రమంలో హెచ్ఒడీలు ఎ.శివశంకర్, ఎ.త్రినాథ్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ జగన్మోహన్‌రెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహవంతంగా పాల్గొన్నారు.



మొక్కలు నాటి నీరు పోస్తున్న ప్రిన్సిపల్

## అయ్యప్ప ఆలయానికి సిసి కెమెరాల వితరణ

**ప్రజాశక్తి - ఖాజీపేట**

మండలంలోని కడప–కర్నూల్ జాతీయ రహదారి పక్కనున్న అయ్యప్పస్వామి ఆలయానికి పిచ్చపాటిపల్లె గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పాపన మల్లికార్జునరెడ్డి శనివారం సిసి కెమెరాలను వితరణ చేశారు. ఆలయ అధ్యక్షులు పత్తి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు కారం శెట్టి సుబ్బారావు, సెక్రటరీ ఉండేల రాఘవరెడ్డికి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా పత్తి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆలయ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు.



సిసి కెమెరాలను అందిస్తున్న దాత

## రాజా ఫౌండేషన్ బాధ్యతలను కథోలిక సంస్థకు అప్పగించాలి

**- ఇండియా స్టూడెంట్ యూనియన్ డిమాండ్**

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

రాజా ఫౌండేషన్ బాధ్యతలను కథోలిక సంస్థకు అప్పగించాలని, పూజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని శనివారం ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిప్యూటీ తహశీల్దార్ సాయినాథ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాడీ హోమ్ అధినేత దివంగత ఫాదర్ రాజారెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న పూజా ఇంటర్నేషనల్ ఆస్తులన్నీ కబ్జా చేసేందుకు కొంతమంది అక్కడ పనిచేసే సిబ్బందిని బయటికి పంపించే కుట్ర చేస్తున్నారని, అనాథ పిల్లల భవిష్యత్తు కోసం దేవాలయంలా ఏర్పడిన పూజ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఆక్రమించుకునేందుకు కొంతమంది కుట్ర చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై విచారించి, విద్యార్థులకు భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్, లింగమయ్య పాల్గొన్నారు.

# క్రైం కార్నర్

## నీటి ట్యాంక్‌లో పడి ఉద్యోగి మృతి

**ప్రజాశక్తి - ముద్దనూరు**

నీటి పరీక్ష నిమిత్తం నీరు సేకరించేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటి ట్యాంక్‌లో పడి ఆర్‌టిపిపి ఉద్యోగి హుస్సేన్ బాషా (47) మృతి చెందాడు. కొండా పురం సర్కిల్ పోలీస్‌స్టేషన్ సిఐ వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మల మడుగులో నివాసం ఉంటున్న హుస్సేన్ బాషా ఆర్‌టిపిపిలో జూనియర్ ప్లాంట్ అటెండెంట్ (జెపిఎ)గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి విధుల్లో భా గంగా వాటర్ ట్యాంక్‌లో నీటి పరీక్ష కోసం నీటిని సేకరించేందుకు వెళ్లి ప్రమా దానికి గురయ్యాడు. చుట్టు పక్కల వెతికినా కనిపించలేదు. మరుసటిరోజు మృత దేహం నీటిలో గుర్తించినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.



మృతి చెందిన హుస్సేన్ బాషా

## ట్రాక్టర్ కిందపడి విద్యార్థి..

**ప్రజాశక్తి - వల్లూరు**

మండల పరిధిలోని పెద్దపుత్త గ్రామంలో బండల లోడుతో వస్తున్న ట్రాక్టర్ కిందపడి శనివారం విద్యార్థిని శ్రీరామ్ రెడ్డెమ్మ (13) మృతి చెం దింది. రెడ్డెమ్మ పెద్దపుత్త ఉన్నత పాఠ శాలలో ఏడవ తరగతి చదువుతోంది. బాలిక పోట్లదుర్తి పంచాయతీ వెంకటా పురం గ్రామానికి చెందిన శ్రీరామ్ సుబ్బరాయుడు, రుక్మిణమ్మ దంపతుల మొదటి సంతానం. చదువు నిమిత్తం రెడ్డెమ్మ దుగ్గాయ పల్లెలోని అవ్వగారి ఇంట్లో ఉంటూ చదువుకుంటోంది. పాఠశాల ముగిసిన అనంతరం సైకిల్‌లో ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో ప్రమాదవశాత్తూ బండల లోడుతో వస్తున్న ట్రాక్టర్ కింద పడింది. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. విద్యార్థిని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.



రెడ్డెమ్మ (ఫైల్‌ఫొటో)